క్లుప్తంగా

బొడ్డేపల్లి సేవలు మరువలేనివి



బొడ్డేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, తదితరులు

నరసన్నపేట: ఆరు పర్యాయాలు ఎంపీగా పని చేసి జిల్లా అభివృద్ధిలో బొడ్డేపల్లి రాజగోపాల రావు కీలకపాత్ర పోషించారని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. బొడ్డేపల్లి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం నరసన్నపేట ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బొడ్డేపల్లి సేవలను గుర్తు చేసుకున్నారు. కాళింగ సంక్షేమ సంఘం నరసన్నపేట అధ్యక్షుడు ఉప్పాడ పూర్ణారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కాళింగ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆర్.కృష్ణంనాయుడు, బలగ మురళి, బమ్మిడి శ్రీరామమూర్తి, దానేటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఏసీ వితరణ



ఏసీ అందజేస్తున్న చంద్రకళ, వరలక్ష్మి

హిరమండలం: స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమానికి రాజాం పట్టణానికి చెందిన కెంగువ చంద్రకళ తన భర్త గోపాలరావు జ్ఞాపకార్థం రూ.45 వేల విలువ చేసే ఏసీని తల్లి గుడ్ల వరలక్ష్మి చేతులమీదుగా ఆశ్రమ కో ఆర్డినేటర్ ఎస్.బాబాకు గురువారం అందించారు. వృద్ధుల సౌకర్యార్థం ఏసీని అందించడం జరిగిందన్నారు. ఆశ్రమ అభివృద్ధి కమిటీ సభ్యులు చంటి మాస్టర్, జోష్యుల గోవిదం శర్మ, మేనేజర్ జయరాం తదితరులు ఉన్నారు.

వైద్య సేవలు సక్రమంగా అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

నరసన్నపేట: గ్రామాల్లో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని డీఎంహెచ్ఓ బి.మీనాక్షి అన్నారు. మడపాంలోని వెల్‌నెస్ కేంద్రంతోపాటు స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. వెల్‌నెస్ కేంద్రం పనితీరును పరిశీలించారు. రోగులు వస్తున్నారా.. వైద్యం అందిస్తున్నారా.. అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని మాకివలస వైద్యాధికారి శిరీషకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం గుర్తించి ఆరా తీశారు. వైద్య సిబ్బందికి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.


యోగా క్రీడాకారిణికి అభినందన



లగుడు లక్ష్మిని అభినందిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాజస్థాన్‌లోని కోటా నగరంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి యోగాసనాల పోటీల్లో బంగారు పతకంతోపాటు చాంపియన్ ఆఫ్ ది చాంపియన్ షిప్‌ను ఆమదాలవలసకు చెందిన లగుడు లక్ష్మి సాధించారు. ఆమెను స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం శారద కల్యాణ మండపంలో అభినందించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. జిల్లా నుంచి మరింతమంది యోగా క్రీడాకారులను తయారుచేసి, జిల్లా పేరును ఇనుమడింపజేయాలని లక్ష్మికి సూచించారు. యోగా గురువు లగుడు అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుంపల శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

55 మందికి కంటి పరీక్షలు



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మెళియాపుట్టి: స్థానిక పీహెచ్‌సీలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైద్యులు గ్రీష్మ, అలేఖ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవలో ఆర్‌బీకేలు



రైతులకు విత్తనాలను సరఫరా చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- వ్యవసాయ సేవలన్నీ గ్రామాల్లోనే..
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా..



గతంలో విత్తనాల కోసం క్యూలో నిల్చున్న రైతులు (ఫైల్)

ఆమదాలవలస రూరల్: రాష్ట్రంలో నూతన వ్యవసాయ విధానానికి రైతు భరోసా కేంద్రాలు నాంది పలికాయి. అన్నదాతకు అండగా ఉండేందుకు అధికార యంత్రాంగం పల్లె ముంగిటకే వచ్చింది. ఆర్‌బీకేలు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నాయి. ఆమదాలవలస మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 13 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మండల కేంద్రాలు, సమీప పట్టణ ప్రాంతాలకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. ఈ సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా రైతులకు అన్ని సేవలు గ్రామస్థాయిలోనే అందిస్తున్నాయి.

ఆర్‌బీకేల ద్వారా అందజేస్తున్న సేవలు..

వ్యవసాయం దశ, దిశను మార్చడంతో పాటు గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి ఆర్‌బీకేలు ఆలంబన అవుతున్నాయి. నాణ్యమైన ఉత్పదకాలను రైతులకు అందించడంతో పాటు వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. రైతులకు సమస్త సమాచారం అందించేందుకు కియోస్క్ యంత్రాలు ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేశారు. ఈ యంత్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటే సకాలంలో అందజేస్తారు. ఇప్పటికే గ్రామాల్లో ఆర్‌బీకేల ద్వారా బస్తాకు రూ.300 సబ్సిడీ అందిస్తూ విత్తనాలను రైతు ఇంటి వద్దకే సరఫరా చేస్తున్నారు. సాగులో కీలకమైన విత్తనాలు నాణ్యమైనవి సరఫరా చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం కూడా విత్తనాలకు భారీగా సబ్సిడీ ఇవ్వడంతో రైతులు ముందుకు వచ్చి కొనుగోలు చేసేందుకు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. రైతులకు ఏమి కావాలన్నా నమోదు చేసుకున్న 24 గంటల్లోనే అందిస్తారు.

మండలంలో సాగు వివరాలు..	
మండలంలో రైతు భరోసా కేంద్రాలు	23
ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం	13 వేల ఎకరాలు
అవసరమైన వరి విత్తనాలు	1660.50 క్వింటాళ్లు
ఇప్పటివరకు రైతులకు అందించిన విత్తనాలు	1146 క్వింటాళ్లు
కిలోకు అందిస్తున్న సబ్సిడీ	రూ.10

ఇంటి వద్దకే విత్తనాలు



గతంలో విత్తనాలు కావాలంటే ఆమదాలవలస మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి క్యూలో గంటల కొద్దీ నిలబడి ఉంటే విత్తనాలు దొరికేవి. కొన్నిసార్లు అక్కడ కూడా విత్తనాలు లేకపోతే పట్టణంలో ఉన్న ప్రైవేట్ డీలర్ల వద్ద ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సివచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం హయాంలో ఆర్‌బీకేల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే విత్తనాలు, ఎరువులు సకాలంలో గ్రామాల్లోనే దొరకుతున్నాయి.

– పేడాడ సత్యనారాయణ, రైతు, శ్రీనివాసాచార్యులపేట, ఆమదాలవలస

సకాలంలోనే సేవలు..



గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా సకాలంలోనే ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారు. నేను ఐదు ఎకరాల్లో వ్యవసాయాన్ని సాగు చేస్తున్నాను. ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలు ఇప్పటికే తీసుకున్నాను. వర్షాకాలం అదునుచూసి నాట్లు కూడా పూర్తిచేయడం జరుగుతుంది. ఎరువులు కూడా తీసుకుని ఇంటిలో భద్రపరుచుకుంటున్నాం. ఎంత ఎరువులు కావాలంటే అంత ప్రభుత్వం సరఫరా చేస్తుంది.

– పొగిరి రమణమూర్తి, రైతు, కొరపాం, ఆమదాలవలస మండలం

వ్యవసాయానికి కొత్తరోజులు వచ్చాయి



పూర్వకాలంలో వ్యవసాయం చేయాలంటే భయం వేసేది. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయానికి కొత్త రోజులు వచ్చాయి. గ్రామంలోనే ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించడం వల్ల 2.50 ఎకరాల వ్యవసాయాన్ని సులువుగా చేయగలుతున్నాను. పెట్టుబడి సాయంగా ముందుగానే రైతు భరోసా పథకం ద్వారా రూ.5500 ప్రభుత్వం సాయం అందుతుంది. విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై కొనుగోలు చేసుకున్నాం.

– బెండి అప్పలసూరి, రైతు, కణుగులవలస, ఆమదాలవలస మండలం

పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో వ్యవసాయ సేవలు అందించడం జరుగుతుంది. రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై సరఫరా చేస్తున్నాం. వ్యవసాయ సలహాలు, సూచనలు అందించడానికి ప్రతీ ఆర్‌బీకేలో వ్యవసాయ సహాయకులను ప్రభుత్వం నియమించింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు వల్ల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుంది.

– మెట్ట మోహనరావు, వ్యవసాయాధికారి, ఆమదాలవలస మండలం

ప్రతి ఇంటికీ సేవలు



పొందూరు: మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయొద్దు
- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: జగనన్న సురక్ష కార్యక్రమంపై స్పీకర్ తమ్మినేని సీతారాం పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఆమదాలవలసలోని శారద కల్యాణ మండపంలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ మండలాలు,ఆమదాలవలస మున్సిపాలిటీకి సంబంధించిన అధికారులతో, పార్టీ కేడర్‌తో స్పీకర్ గురువారం సమావేశం నిర్వహించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఈనెల 23వ తేదీ నుంచి వచ్చేనెల 23వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రమంతా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో జూలై 1వ తేదీ నుంచి 11 సర్టిఫికెట్ల మంజూరుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఇందు కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు వారాల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగానికి సహకరించేలా పార్టీ క్యాడర్ పనిచేయలన్నారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పీకర్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, ఎంపీడీఓలు రవీంద్రబాబు, మోహన్, వాసుదేవరావు, తహసీల్దార్లు గణపతిరావు, రమేష్, రమణారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పొందూరు ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీలు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ సమస్యకు పరిష్కారం

పొందూరు: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతి సమస్యకు పరిష్కారం లభించనుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండల కేంద్రంలోని జేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెలాఖరు వరకు గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన సేవలను గుర్తించే సర్వే పూర్తిచేయాలన్నారు. జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ సునీల్, సర్పంచ్ రేగిడి లక్ష్మి, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, మండల ప్రత్యేకాధికారి కృష్ణారావు, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ హరిహరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలలను పనిలో పెడితే క్రిమినల్ కేసు



కరపత్రాలు అందజేస్తున్న జడ్జి తేజ చక్రవర్తి

పాతపట్నం: బాలలను పనిలో పెట్టొద్దని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని పాతపట్నం కోర్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి అన్నారు. పాతపట్నంలో పలు దుకాణాలకు వెళ్లి పరిశీలించి కరపత్రాలను అందజేశారు. 14 ఏళ్లలోపు బాలబాలికలతో పనిలో పెడితే క్రిమినల్ కేసులు నమోదు అవుతాయన్నారు. సరాలి రోడ్డులోని అంతరాబ వద్ద ఉన్న బ్రిక్ ఇండస్ట్రీలో బాల కార్మికుడిని గుర్తించారు. కొరసవాడ గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ మహమ్మద్ యాసీన్, ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు, న్యాయవాదులు జి.ఫల్గుణరావు, బి.ఈ.సత్యనారాయణ, లేబర్ ఆఫీసర్ జయశంకర్, ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం



కొదూరులో సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాతటప్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కొదూరు, ప్రహరాజపాలెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్ల ప్రభుత్వ అందజేసిన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. మౌలిక వసతుల కల్పన, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలనపై స్థానికులు సంతప్తి వ్యక్తం చేశారు. కొదూరు గ్రామానికి చెందిన కల్లాట మాధవరావు తనకు గృహ నిర్మాణం బిల్లు పడిందని హర్షం వ్యక్తం చేశాడు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎక్కడైనా అర్హులకు పథకాలు అందకపోతే వెంటనే సచివాలయంలో జగనన్న సురక్ష ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పారదర్శకంగా పాలన అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వనిదేన్నారు.

మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను దీవించాలని కోరారు. మండల గ్రామ సచివాలయ కన్వీనర్ వై.సూర్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు జి.అప్పన్న, దొర పార్వతీశం, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, జన్ని అప్పన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, దేవాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.చంద్రయ్య, సర్పంచ్ పనుకు నాగమణి, పార్టీ నాయకులు పనుకు మోహన్, టి.ప్రవీణ్, మురళీ ఆప్టో, సత్య బిషాల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

హిరమండలం: ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని టెక్కలి ఉపవిద్యా శాఖాధికారి పి.పగడాలమ్మ అన్నారు. మండలంలోని భగీరథిపురం, గులుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. జగనన్న గోరుముద్దను రుచి చూశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ కె.రాంబాబు పాల్గొన్నారు.

హౌసింగ్ డీఈగా రామ్మూర్తి



నరసన్నపేట: స్థానిక గృహ నిర్మాణశాఖ డివిజన్ కార్యాలయంలో డీఈగా గాలి రామ్మూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీఈగా పని చేసిన అప్పారావు ఎచ్చెర్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీఈగా రామ్మూర్తిని జిల్లా హౌసింగ్ పీడీ నియమించారు. రామ్మూర్తి మాట్లాడుతూ నియోజకవర్గంలో గృహ నిర్మాణాలు మరింత చురుగ్గా చేపట్టడానికి కృషి చేస్తానన్నారు.

కౌలు రైతులకు సాగు హక్కు కార్డులు

నరసన్నపేట: మండలంలోని కౌలు రైతులు పంట సాగుదారు కార్డులు పొందవచ్చని, దీని కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ కె.సునీత అన్నారు. నడగాంలో గురువారం కౌలు రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. భూయజమానులకు ఎటువంటి నష్టం లేకుండా వారి భూమి సాగు చేస్తున్న రైతులకు 11 నెలలకు పంట సాగుదారుల హక్కు చట్టం ప్రకారం సాగు హక్కు కార్డు పొందవచ్చన్నారు. ఈ కార్డు ఉన్న రైతులకు భూమిపై ఎటువంటి హక్కులు ఉండవన్నారు. పంట రుణం, పంటల బీమా, సబ్సిడీ పథకాలు పొందవచ్చన్నారు. భూయజమానులు కౌలు రైతులకు సహకరించాలని కోరారు. వీఏఏ శ్రవంతి, వీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

హిరమండలం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ అన్నారు. మండలంలోని పిండ్రువాడ సచివాలయంలో గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లతో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల ముంగిటికే ప్రభుత్వం సంక్షేమ పథకాలు, పౌరసేవలు అందించడమే జగనన్న సురక్ష ఉద్దేశమన్నారు. జులై 1 నుంచి ప్రారంభం కానున్న కార్యక్రమం కోసం ప్రతీచివాలయ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొర్రంపేట గ్రామ సచివాలయంలో గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాల వారికి ప్రభుత్వ పరంగా అవసరమయ్యే సేవలు కోసం తెలుసుకోవాలన్నారు. జూలై నెల ఒకటో తేదీ నుంచి నెల రోజుల పాటు 11 రకాల సేవలను అందించే బాధ్యత మనందరిపైన ఉందన్నారు. సర్పంచ్ బొడ్డేపల్లి రమణమ్మ, ఎంపీటీసీ కింతలి చిరంజీవి, గ్రామ పెద్దలు బొడ్డేపల్లి చిట్టిబాబు పాల్గొన్నారు.

జలుమూరు: మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఎంపీపీ వాన గోపి సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రతీ పంచాయతీని జూలై ఒకటి నుంచి 28 వరకు సందర్శిస్తారన్నారు. తహసీల్దార్ బి.సత్యం, ఎంపీడీఓ ఐవీ అప్పారావు, ఎంఈఓ మాధవరావు, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: జూలై 1 నుంచి 28 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలో నిర్వహిస్తున్నామని ఎంఎల్ఓ రేవంత్ అన్నారు. జాడుపల్లి సచివాలయంలో వచ్చే నెల 4న కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సచివాలయాల మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, టి.ప్రసాదరావు, కార్యదర్శి ఢిల్లీశ్వరరావు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: జగనన్న సురక్షపై మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

షెడ్యూల్ ఇలా..

సరుబుజ్జిలి మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో నిర్వహించనున్న జగనన్న సురక్ష శిబిరాలు షెడ్యూల్‌ను మండల సచివాలయం కోఆర్డినేటర్ అత్తులూరి రవికాంత్ గురువారం విడుదల చేశారు. జూలై 1న కొండవలస, 3న రొట్టవలస, 4న సరుబుజ్జిలి, 5న సింధువాడ, 6న పెద్దసవళాపురం, 7న షళంత్రి, 10న పురుషోత్తపురం, 11న కొత్తకోట, 12న తెలికిపెంట, 13న విజయరాంపురం, 14న చినకాగితాపల్లి, 15న మతలబుపేట, 18న చిగురువలస, 19న పాలవలస, 20న గోనెపాడు, 21న యరగాం గ్రామాల్లో ప్రతిరోజు ఉదయం 9.30 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు.

నాయీబ్రాహ్మణ గర్జన విజయవంతం చేయాలి

సారవకోట: ఈ నెల 27న శ్రీకాకుళంలో జరగనున్న నాయీబ్రాహ్మణ గర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు జమ్ము జంగులు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో గర్జనను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మిగుల సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి గురువారం తెలిపారు. మిగులు సీట్లకు ఈ నెల 26వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి పరీక్ష ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందన్నారు.

నవోదయకు పలువురి విద్యార్థుల ఎంపిక



వి.మౌనిక



కోర్ను శరణ్య



బైరోతు గణేష్



గొర్లె కౌశిక్



అంబల్ల శ్యామ్‌సాయి

పొందూరు: సరుబుజ్జిలి మండలంలోని వెన్నలవలస జవహర్ నవోదయ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో పొందూరులోని ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అంబళ్ల శ్యామ్‌సాయి, గొర్లె కౌశిక్ ఎంపికయ్యారు. వీరిని ఎంఈఓలు రామరాజు, పట్నాన రాజారావు, పాఠశాల నిర్వాహకులు ఎంఆర్ఆర్‌సీహెచ్ కుమార్, జి.ఈశ్వరరావు అభినందనలు తెలిపారు.

బూర్జ: మండలంలోని చినలంకాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నవోదయకు బొడ్డేపల్లి లోహితాశ్రీమణి, బాన్న జగదీష్ ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు ముదిలి రామారావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొర్రంపేట ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థిని వి.మౌనిక నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు.హెచ్ఎం కె సింహాచలం, ఉపాధ్యాయులు ఎస్.అజీం, గ్రామ సర్పంచ్ బొడ్డేపల్లి రమణమ్మ, ఎంపీటీసీ కింతలి చిరంజీవి, ఎంఈఓ కె.చంద్రమౌళి అభినందించారు.

పాతపట్నం: నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి పాతపట్నానికి చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కోర్ను శరణ్య, బౌరోతు గణేష్, కొరాడ అనుబొవ్, పెనుమల్లు విఘ్నేష్‌ను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటింటికీ తాగునీటి కుళాయిల ప్రారంభం

ఎల్.ఎన్.పేట: మండలంలోని కొమ్మువలసలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికీ తాగునీటి కుళాయిలను సర్పంచ్ రెడ్డి సుశీల గురువారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడ్డి సీతారాం పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

ఆమదాలవలస రూరల్: మండలంలోని కట్యాచార్యులపేట రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలను సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు గురువారం పంపిణీ చేశారు. రైతు వద్దకే నేరుగా విత్తనాలు, ఎరువులు సరఫరా చేసి రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వీఏఏ నవ్యభార్గవి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



విద్యార్థులకు నగదుబహుమతి అందిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మండలంలోని గోనెపాడు జెడ్పీ హైస్కూల్ 2009 బ్యాచ్‌లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బిర్లంగి కృష్ణమూర్తి, కూర్మాపు చిరంజీవి, మామిడి సురేష్ అదే పాఠశాలలో 2022–23 బ్యాచ్‌లో పదో తరగతి ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణతపొందిన గొండు రాజేష్, బలగ జశ్వంత్‌లకు ఒక్కొక్కరికి రూ.5 వేల వంతున నగదు బహుమతిని గురువారం అందించారు. ప్రతిఏటా ఇదే విధంగా విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తామని ప్రకటించారు. సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బిర్లంగి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.